# విపశ్యన మాసపత్రిక

VOLUME:17 NO - 08 1 NOVEMBER, 2018

(సాధకుల ప్రేరణ కొరకు ఉద్దేశించబడిన తెలుగు మాసపత్రిక)

విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, ధమ్మఖేత్త, వనస్థలిపురం, హైదరాబాదు - 70

**"ధర్మవాణి"**

సబ్బత్థ వే సప్పురిసా చజన్తి, న కామకామా లపయన్తి సన్తో।
సుఖేన ఫుట్ఠా అథ వా దుఖేన , న ఉచ్చావచం పణ్డితా దస్సయన్తి

*- ధమ్మపదపాళీ - 83 - పణ్డితవగ్గో*

సత్పురుషులు అన్నిచోట్లా (అయిదు స్కందాలలోనూ) కామఛందాన్ని త్యజిస్తారు. వాళ్ళు కామభోగాలకు చెందిన మాటలు మాట్లాడరు. సుఖంలోనైనా, దుఃఖంలోనైనా పండితులు తమ మనసులో సమతనే నిలుపుకుంటారు.

## ప్రథమ గృహస్థ విపశ్యనాచార్యులు సయా తైజీ 2

( ఈ క్రింది వృత్తాంతం మయన్మార్ ధర్మాచార్యులైన ఉ టేయ్ ఫ్లోంగ్ రచించిన "సయా తైజీ" అనే పుస్తకం నుండి గ్రహించబడినది.)

### రెండవ భాగం...

లైడి సయదా నుండి ఆశీస్సులు తీసుకుని సయా తైజీ తన బంధువులతో కలిసి దక్షిణ బర్మాలో నున్న తన స్వగ్రామమైన డల్లా (ప్యాబ్వేజీ) కి తిరిగి వచ్చారు. లైడి సయదా గారి గురుతర ఆదేశాన్ని పాటించటం గురించి ఇతర కుటుంబ సభ్యులతో చర్చించారు. బర్మా అంతటా సంచరిస్తూ శిబిరాలు నిర్వహించటం ద్వారా ఎంతోమందికి ధర్మాన్ని అందించవచ్చు అనే ఆలోచన సయా తైజీ మనసులో కలిగింది. కానీ వారి మరదలు మాత్రం - " ఇక్కడ మీ దగ్గర ధర్మకేంద్రం ఉంది. సాధకులకు భోజనాది సౌకర్యాల విషయంలో మేమంతా మీకు సహాయపడగలం. మీరిక్కడే, ఉండి శిబిరాలు నిర్వహించవచ్చు కదా, ఎంతోమంది ఇక్కడకే వచ్చి విపశ్యన నేర్చుకుంటారు." అని సలహా ఇచ్చింది. దానికి వారు ఒప్పుకుని ప్యాబ్యేజి (డల్లా) లోనే ఉంటూ తన కేంద్రంలో శిబిరాలు నిర్వహించసాగారు.

వారి మరదలు భవిష్యవాణి ప్రకారమే ఎంతోమంది శిబిరాలకు రాసాగారు. సయా తైజీ, ధ్యానాచార్యులుగా పేరు గాంచారు. ఆయన సాధారణ రైతులు, కూలీలతో పాటు పాళీ విద్వాంసులకు కూడా విపశ్యన నేర్పించటం మొదలుపెట్టారు. ఈ గ్రామం, బర్మాదేశాన్ని ఆంగ్లేయులు పాలించే సమయంలో రాజధాని రంగూన్‌కు దగ్గరగా ఉన్న కారణంగా ఊ బా ఖిన్ వంటి ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులతో పాటు పట్టణ ప్రజలు కూడా రాసాగారు.

ఇలా ఎంతో మంది సాధకులు వస్తూండడంతో వారు ఊ న్యో, ఊ బా సో, ఊ న్యూమ్ వంటి అనుభవజ్ఞులైన సాధకులను సహాయక ఆచార్యులుగా నియమించారు.

ఇలా ప్రతీ సంవత్సరం కేంద్రానికి వచ్చే వారి సంఖ్య పెరుగుతూ పోయింది. ఒక్కో శిబిరంలో భిక్షువులు, భిక్షుణిలతో సహా దాదాపు 200 మంది సాధకులు పాల్గొనేవారు. కేంద్రంలో తగినంత స్థలం లేని కారణంగా ఎంతో అనుభవజ్ఞులైన పాత సాధకులు వాళ్ళ ఇళ్లలోనే ధ్యానం చేసుకుంటూ కేవలం ప్రవచనాల కొరకే కేంద్రానికి వచ్చేవారు.

లైడి సయదా గారి కేంద్రం నుండి తిరిగి వచ్చిన తరువాత సయా తైజీ ఏకాంతంగా, మౌనంగా ఉంటూ రోజుకు ఒక్క పూట మాత్రమే భోజనం చేసేవారు. భిక్షువుల లాగా తన ఆధ్యాత్మిక ప్రగతిని గురించి ఎవరితోనూ చర్చించేవారు కాదు. కానీ అతను నిర్వాణానికి ముందరి స్థితి అయిన అనాగామి స్థాయికి చేరుకున్నారు అని బర్మా అంతటా అనుకునేవారు. కానీ తను కానీ తన శిష్యులు కానీ ఏ స్థాయిలో ఉన్నారో ఆయనెప్పుడూ చెప్పలేదు. అయితే బర్మాలో మాత్రం ఆయన్ను 'అనాగామీ సయా తైజీ' గా గుర్తించేవారు.

ఆ రోజుల్లో గృహస్థ విపశ్యన ఆచార్యులెవరూ ఉండేవారు కాదు. దానితో భిక్షువులు కూడా ఎదుర్కొని ఆటంకాలు సయా తైజీ ఎదుర్కోవలసి వచ్చింది. కొంతమందైతే శాస్త్రాల్లో విద్వాంసుడు కాదు అని సయా తైజీని వ్యతిరేకించే వారు. కానీ సయా తైజీ మాత్రం ఇటువంటి విమర్శలను ఏ మాత్రం పట్టించుకోకుండా సాధన ద్వారా వచ్చే పరిణామాలనే ఉదాహరణంగా చూపించేవారు.

ఒకసారి వారి పొలంలో పనిచేసే కూలీలు సయా తైజీ యొక్క మంచితనాన్ని అలుసుగా తీసుకుని పంటలో వారికివ్వాల్సిన భాగాన్ని ఇవ్వలేదు. పొలం పనుల వంటి సాంసారిక వ్యవహారాల నుండి తను దూరం ఉన్నప్పటికీ ఆ కూలీల హితం కోరి, వాళ్ళు కోపం, హింసల వంటి అకుశల ప్రవృత్తిని మరింతగా పెంచుకోకుండా ఉండటానికి సయా తైజీ ఈ వ్యవహారంలో కలుగచేసుకుని, వారిని ధర్మమార్గం వైపుకు నడిపించే దిశగా సమస్య పరిష్కారానికి పూనుకున్నారు.

తన స్వానుభవంతో, లైడి సయాదా గారి వ్యాఖ్యానాలను ఆధారంగా చేసుకుని వారు 30 సంవత్సరాల పాటు తన దగ్గరకు వచ్చిన వాళ్లందరికీ ధ్యానం నేర్పించారు. కొన్ని వేల మందికి విపశ్యన నేర్పాలన్న

ఆశయాన్ని 1945లో, తన 72వ ఏట పూర్తి చేశారు. వారి భార్య కాలం చేశారు. వారి మరదలు కూడా పక్షవాతానికి గురయ్యారు, సయా తైజీ ఆరోగ్యం కూడా క్షీణిస్తూ పోయింది. దానితో వారు ధర్మ కేంద్రాన్ని నిర్వహించడానికి అవసరమైన 50 ఎకరాల పొలం మాత్రమే ఉంచుకుని మిగిలిన ఆస్తినంతా తన అల్లుళ్లకూ, మరిదులకూ, కోడళ్ళకూ, మరదళ్లకూ పంచేసారు.

ఇన్నేళ్ళూ తన పొలం పనులకు ఉపయోగపడిన 20 గేదెలను వాటి పట్ల దయతో వ్యవహరిస్తారనే నమ్మకమున్న వ్యక్తులకు అప్పగించారు. ఆ గేదెలను పంపిస్తూ, "ఇన్నేళ్ళూ మీరు మాకెంతో లాభం చేకూర్చారు, మీ కారణంగానే వరి, ఇతర ధాన్యాలు బాగా పండాయి. ఇప్పుడు మీ పని నుండి మీరు ముక్తి పొందారు. ఇలాంటి జీవితం నుండి మీకు ముక్తి కలిగి మరుసటి జన్మలో మంచి జీవితం లభించాలి." అని ఆశీర్వదించి పంపారు.

సయా తైజీ వైద్యం చేయించుకోటానికి, తన శిష్యులను కలవటానికి రంగూన్ వెళ్లారు. అక్కడ కొద్దిమంది శిష్యులతో మాట్లాడి తాను రంగూన్‌లోనే దేహత్యాగం చేస్తానని, ఇప్పటివరకూ ఎవరికీ దహన సంస్కారాలు చేయని ప్రదేశంలో తన దహన సంస్కారాలు చేయాలని చెప్పారు. తను అన్ని రకాల సంయోజనాల నుండి (మానవులను బంధించే బంధనాలు) ముక్తి పొందలేదు, అంటే అరహంతుడు కాలేదు. కాబట్టి తన అస్థికలను ఏ పవిత్ర స్థలంలోనూ ఉంచవద్దని కోరారు.

వారి శిష్యులలో ఒకరు ష్వేడగాన్ పగోడా ఉత్తర భాగం దిగువలో ఉన్న అజ్నిగాన్ పై ధ్యాన కేంద్రాన్ని స్థాపించారు. దానికి దగ్గరలో రెండవ ప్రపంచయుద్ధ కాలంలో బాంబులదాడి నుండి కాపాడుకోటానికి కట్టిన రక్షణస్థానం ఉండేది. సయా తైజీ ఆ ప్రదేశాన్ని శున్యాగారంలాగా ఉపయోగించేవారు. ప్రతి రాత్రీ తన సహాయక ఆచార్యులలో ఒకరిని తనతోపాటు అక్కడే ఉండమనేవారు. రంగూన్‌లోని శిష్యులు సమయం దొరికినప్పుడల్లా వారిని కలవడానికి వచ్చేవారు. వారిలో అకౌంటెంట్ జనరల్ ఊ బా ఖిన్, ఇన్కంటాక్స్ కమీషనర్ ఊ సాన్ థై కూడా ఉండేవారు.

వారిని కలవడానికి వచ్చిన వారికంతా, ఎంతో శ్రద్ధగా సాధన చేయమనీ, ధ్యానం నేర్చుకోవడానికి వచ్చిన భిక్షువులు, భిక్షుణిలను ఆదరించాలని, మనోవాక్కాయ కర్మల పట్ల అదుపు కలిగి ఉండమనీ, ప్రతి ఒక్క పనిలోనూ బుద్ధభగవానుని గౌరవాన్ని పెంచాలని ఉపదేశం ఇచ్చేవారు.

ప్రతి సాయంత్రం ష్వేడగాన్ పగోడాకి వెళ్ళే అలవాటు ఆయనకు ఉండేది. కానీ భూమిలోపల కట్టబడిన గుహలో కూర్చోవడం వల్ల ఒకవారం తర్వాత ఆయనకు జలుబుతో పాటు జ్వరం వచ్చింది. డాక్టర్లు వైద్యం చేసినప్పటికీ వారి పరిస్థితి క్షీణిస్తూపోయింది. ఆయన పరిస్థితి మరింత క్షీణించటంతో ఆయన అల్లుళ్ళు – మరిదులంతా ప్యాబ్వేజి నుండి రంగూన్ చేరుకున్నారు. ప్రతిరాత్రీ సుమారు యాభైమంది శిష్యులు ఆయనతో కలిసి ధ్యానం చేసుకునేవారు. ఈ సామూహిక సాధనల్లో సయా తైజీ ఏమీ మాట్లాడకుండా మౌనంగా ధ్యానం చేసుకునేవారు.

ఒకరోజు రాత్రి సుమారు పది గంటలకు వారితో కొద్దిమంది శిష్యులు తోడుగా ఉన్నారు (ఊ బా ఖిన్ గారు అప్పటికి చేరుకోలేక పోయారు.) ఆయన వెల్లకిలా పడుకుని ఉండగా, శ్వాస వేగంగా మారి బరువెక్కింది. ఇద్దరు శిష్యులు మాత్రం వారినే ఏకాగ్రతతో చూస్తూ ఉండగా మిగతా వారు సాధనలో నిమగ్నమై ఉన్నారు. సరిగ్గా 11 గంటలకు శ్వాస మరింత మందగిచింది. ఒక్కొక్క ఉచ్ఛ్వాస – నిశ్వాసకు 5 నిమిషాలు పట్ట సాగింది. ఇలాంటి మూడు దీర్ఘ శ్వాసల తర్వాత శ్వాస పూర్తిగా నిలిచిపోయి సయా తైజీ దేహ త్యాగం చేశారు.

ష్వేడగాన్ పగోడకు ఉత్తర దిశలో పల్లపు ప్రాంతంలో వారి దహన సంస్కారాలు చేయబడ్డాయి. ఆ తరువాతి కాలంలో సయాజీ ఊ బా ఖిన్, వారి శిష్యులు అక్కడ ఒక చిన్న పగోడా నిర్మించారు. కానీ లైడి సయదా నుండి ఆయనకు లభించిన ధర్మాన్ని సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకూ చేరవేసే ఈ మహత్తర కార్యం నేటికీ నిర్విఘ్నంగా కొనసాగుతుండమే ఈ అనుపమ ఆచార్యుని నిజమైన స్మారక చిహ్నం. అందరికీ మేలు జరగాలి.

**సయా తైజీ గురించిన జ్ఞాపకాలు: ... సత్యనారాయణ గోయంకా**

## వ్యవసాయదారుడైన ఆచార్యుడు

రంగూన్ ఆవలి తీరంలోని ఒక గ్రామంలో ఊ తై (శ్రీ తై) అనే రైతు ఉండేవారు. ప్రతి సంవత్సరం పంట కోతల తర్వాత ధ్యానం నేర్పించే ఆచార్యుల కొరకు అన్వేషిస్తూ తిరిగేవారు. చివరికి ఒక ఆచార్యులు ఆనాపాన ద్వారా మనసును ఏకాగ్ర పరచడాన్ని నేర్పారు. ఏడు సంవత్సరాల పాటు కొన్ని నెలల తరబడి ఆయన దగ్గరకు వెళుతూ సమాధిలో ప్రావీణ్యత పొందారు. ఆ తరువాత వారు విపశ్యన నేర్పే గురువు కొరకై వెదుకుతూ ఉండగా అదృష్టం కొద్దీ లైడి సయదా కలిశారు. ఆ గౌరవనీయులైన భిక్షువు ఈ శిష్యుని అర్హతలను గుర్తించి సాధనా విధిని నేర్పారు. మరో ఏడు సంవత్సరాల పాటు ఆయన లైడి సయదా వద్ద ధ్యానం చేస్తూ ప్రజ్ఞలో కూడా ప్రావీణ్యత పొందారు. ఇక తాను నేర్చుకున్న ఈ విద్యను ఇతరులకు నేర్పించకుండా ఉండలేకపోయారు. లైడి సయదా యొక్క అనుమతి పొంది తన గ్రామాన్ని చేరుకొని ఇతరులకు నేర్పించడం మొదలుపెట్టారు.

మొదట్లో ఆయన వద్దకు ఎవరూ వచ్చేవారు కాదు. "ఇతను కూడా మన లాగే సంసారి. ఇతను గుండు చేయించుకోలేదు, భిక్షువులు ధరించే కాషాయ వస్త్రాలు ధరించట్లేదు. ఇతనికి విపశ్యన గురించి ఏమి తెలుసు, ధర్మం గురించి ఏమి తెలుసు?" అంటూ ప్రజలు అవహేళన చేశారు.

అయినప్పటికీ సయా తై జీ (ఆచార్య తై జీ) నిరుత్సాహ పడలేదు. తన పొలంలో పనిచేసే కూలీలను పిలిచి, "మీరు ఎప్పుడూ పొలంలోనే పని చేస్తారు కదా! మీరు ఒప్పుకుంటే మా ఇంట్లో పనిచేసినందుకు గాను మీకు జీతమిస్తాను." అని చెప్పారు.

దానికి వారు, "మీరెలా చెబితే అలాగే, మాకైతే డబ్బులు దొరికితే

చాలు" అని సమాధానమిచ్చారు. సయా తైజీ వారిని పరదాలతో కప్పబడిన గదికి తీసుకువెళ్ళి "మంచిది, కూర్చోండి, కళ్ళు మూసుకుని ధ్యాసంతా శ్వాసపైనే పెట్టండి." అని చెప్పారు.

ఆ కూలీలు ఆశ్చర్యపోయారు. "ఏంటి? ఇంతేనా మనం చేయవలసింది? మన యజమానికి మతిపోయినట్లుంది. ఈయన కేవలం శ్వాసను గమనించేందుకే మనకు భోజనం పెట్టి డబ్బులు కూడా ఇస్తానంటున్నాడు. ఆయన ఇదే చేయించాలనుకుంటే ఈ పనే చేద్దాం." అని ఆలోచించారు. అలా వారు సయా తైజీ చెప్పినట్లే చేయసాగారు. చదువుకోని కూలీ అయినా, బాగా చదివిన ప్రొఫెసర్ అయినా ఈ విద్య అందరికీ ఒకే విధమైన ఫలితాన్నిస్తుంది.

శిబిరం పూర్తయ్యాక ఆ కూలీలు, "మా యజమాని ఎంతో అద్భుతమైన ధ్యాన సాధన నేర్పిస్తారు, దానితో మనసులో అసలైన శాంతి నెలకొంటుంది" అని ఇతరులతో చెప్పసాగారు. కానీ ప్రజలు వారి మాటలు పట్టించుకునేవారు కాదు. "తన గురించి గొప్ప చెప్పించటం ద్వారా జనాలను తనవైపుకు ఆకర్షించుకోవటానికే అతను కూలీలకు డబ్బులిచ్చి ఉంటాడు" అంటూ ఆలోచించారు.

కానీ కొన్ని నెలల తర్వాత గ్రామం అంతటా, "ఊ తైజీ పనివాళ్ళలో గణనీయమైన మార్పు వచ్చిందనీ, వాళ్ళలో కొందరెంతో కర్కశంగా, గూండాల లాగా ప్రవర్తించే వారు; రోజంతా తాగి గొడవలు పడేవారు. కానీ ఇప్పుడు వాళ్ళ ప్రవర్తన వినయ విధేయతలతో కూడుకుని వాళ్ళు శాంత స్వభావులుగా మారిపోయారు" అని చర్చించుకోసాగారు. దానితో గ్రామస్థులు ఎంతో ఉత్సుకతతో, మీ యజమాని మీకు ఏం నేర్పించారని అడగసాగారు. ఆ పనివాళ్ళు వాళ్ల అవగాహన మేరకు చెప్పారు. అది విన్న గ్రామస్థులు, "బుద్ధశాస్త్రాలు కూడా ఈ విషయాలనే వివరిస్తున్నాయి కదా. బహుశా ఈ వ్యక్తికి ఏదో తెలిసి ఉంటుంది. వెళ్లి చూద్దాం. అతను ఏం నేర్పుతున్నాడో!" అని అనుకున్నారు.

ప్రజలు ఏ లక్ష్యంతో శిబిరాలకు వచ్చినా, సరైన పద్ధతిలో సాధన చేస్తే వారికి తప్పకుండా ఫలితం దొరుకుతుంది. ఇలా సయా తైజీ పేరు వ్యాప్తి చెందటం మొదలయింది, వారు లైడి సయదా యొక్క శిష్యులలో శ్రేష్ఠుడయ్యాడు.

## నిప్పుతో చెలగాటం

సయా తైజీ దగ్గర ధ్యానం నేర్చుకోవడానికి ఒక బుద్ధ అనుయాయి అయిన విద్వాంసుడు వచ్చాడు. దురదృష్టవశాత్తూ అతడు, విపశ్యనను స్వంత అనుభూతి ద్వారా తెలుసుకోవడం కన్నా దాని సిద్ధాంతాన్ని తెలుసుకోవటానికే ఉత్సాహపడ్డాడు. అయినప్పటికీ శిబిరాన్ని విజయవంతంగా ముగించుకుని తనకు లభించిన దానితో సంతోషపడి వెళ్ళిపోయాడు.

కొన్ని నెలల తర్వాత ఆ పెద్దమనిషి సయా తైజీని కలవడానికి వస్తూ ఒక పుస్తకపు కొన్ని ప్రతులను వెంట తీసుకువచ్చాడు. "శ్రీమాన్! ధ్యానం ఎలా చెయ్యాలో వివరిస్తూ నేను ఒక పుస్తకాన్ని రాశాను. మిమ్మల్ని గురువుగా భావించి దీన్ని మీకు అంకితమిచ్చాను." అని అన్నాడు.

"నీవు ఈ కొన్ని ప్రతులనే నాకు అంకితమిచ్చావా?" అని సయా తైజీ అడిగారు.

"లేదు శ్రీమాన్, అన్ని ప్రతులనూ అంకితమిచ్చాను" అన్నాడు.

"మంచిది, నీ పుస్తకపు అన్ని ప్రతులనూ నాకు అంకితమివ్వాలనుకుంటే అన్ని ప్రతులనూ ఇక్కడకు తీసుకురా." అన్నారు. తనకు ఆశీస్సులు ఇవ్వడానికి ఏదో కర్మకాండ చేస్తారనుకున్నాడో ఏమో చాలా సంతోషంగా వెళ్లి కొద్ది రోజుల తర్వాత ఒక బండెడు పుస్తకాలను తీసుకుని వచ్చాడు.

"ఇవేనా నీవు రాసిన పుస్తకపు అన్ని ప్రతులు?" అని సయా తైజీ అడిగారు.

"అవునండీ!" అని అతను గర్వంగా బదులిచ్చాడు.

"మంచిది... వాటినన్నిటినీ ఆ ఖాళీగా ఉన్న నేల మీద పెట్టు" అని అన్నారు. ఆయన చెప్పినట్లే అతను వాటన్నిటినీ క్రమ పద్ధతిలో అమర్చాడు.

"ఇప్పుడు వంటగదికి వెళ్లి కిరోసిన్, అగ్గిపెట్టె తీసుకుని రా!" అని సయా తైజీ అన్నారు.

"శ్రీమాన్! కిరోసిన్, అగ్గిపెట్టెనా?" ఏదైనా కర్మకాండ చేయటానికి వాటి అవసరం ఏంటో అర్థంకాక ఆశ్చర్యపోయాడు.

"అవును, కిరోసిన్ అగ్గిపెట్టెనే" అని అన్నారు. అప్పుడా విద్వాంసుడు, అయిష్టంగానే చెప్పింది చేశాడు. కిరోసిన్, అగ్గిపెట్టె పట్టుకొని వచ్చాడు. ఇక సయా తైజీ, "ఇప్పుడు ఆ పుస్తకాల పైన కిరోసిన్ చల్లి నిప్పు పెట్టు" అని అన్నారు.

దానితో ఆ విద్వాంసుడు, తనను తాను నియంత్రించుకోలేక, "శ్రీమాన్! మీరు నన్ను ఆట పట్టిస్తున్నారు, ఇది రాయడానికి నేను కొన్ని నెలల పాటు శ్రమించాను" అని అన్నాడు.

దానికి సయా తైజీ, "నువ్వు దీని కొరకు వెచ్చించిన సమయంలో ధ్యాన సాధన చేసి ఉంటే ఎంతో బాగుండేది. నీవు లోతుల వరకు ధ్యాన సాధన చేయకుండానే దాని గురించి ఇతరులకు ఏమని వివరించగలవు? నీవు అనుభూతిపరంగా అర్థం చేసుకోకుండానే ఇతరులు ఈ పుస్తకం చదివి ధ్యానం నేర్చుకుంటారని ఎలా ఆశిస్తావు? పిల్లలు నిప్పుతో చెలగాటమాడి వాళ్ళను వాళ్ళే కాల్చుకున్నట్లు, ఈ పుస్తకాన్ని చదివి సాధన చేయటమంటే వారికి వారు హాని చేసుకోవటమే, వారిని వారు దహించుకోవటమే. దాని బదులు ఈ పుస్తకాలను తగలబెట్టటమే మంచిది." అని అన్నారు.

**(సయాజీ ఊ బా ఖిన్ జర్నల్ నుండి గ్రహించబడింది)**

**ప్రశ్నలు – జవాబులు**

క్రింది ప్రశ్న **"For The Benefit Of Many"**కి తెలుగు అనువాదం – **"బహుజన హితాయ"** నుంచి తీసుకోబడింది.

**ప్రశ్న : ధర్మ వ్యాప్తికి మనం ఏ విధంగా తోడ్పడగలం?**

**గోయంకా గారు :** మీకు మీరు సహాయం చేసుకోవటమే మీరు చేసే అసలైన సేవ. మొదట మీరు ధర్మంలో స్థిరపడండి. ప్రజలు మీ జీవన విధానాన్ని చూసి, ధర్మాన్ని పొగడటం మొదలుపెట్టే విధంగా చూసుకోండి. "చూడండి. ధర్మ సాధనకు వెళ్ళే ముందు ఈ వ్యక్తి చాలా భిన్నంగా ఉండేవాడు. కానీ ఇప్పుడు వారిలో ఎంత పెద్ద మార్పు వచ్చింది! ఎంత మంచి వ్యక్తిగా మారాడు!" ఒకవేళ ఆ వ్యక్తిలో ఎటువంటి మార్పు రాలేదని ప్రజలు గమనిస్తే, లేదా అతడు మరింత చెడి పోయి, "నేను గొప్ప విపశ్యనా సాధకుడిని, నేను చాలా నిర్మలమైన వ్యక్తిని!" అని ఆలోచిస్తూ గర్వాన్ని జనించుకోవటం మొదలు పెడితే, ప్రజలు ధర్మం నుండి దూరంగా పారిపోతారు. అలా అయితే ధర్మాన్ని వ్యాపింప చేయటానికి చేసే ప్రయత్నంలో ఎటువంటి ప్రయోజనమూ ఉండదు.

మనలో ప్రతివ్యక్తి ధర్మానికి ప్రతినిధి. కాబట్టి ప్రతి వ్యక్తీ చాలా జాగ్రత్తగా ఉండాలి. ఒక వ్యక్తి విపశ్యన ధ్యానకేంద్రంలో మరింత ఎక్కువ బాధ్యతలు చేపడుతుంటే, అతడు ఇప్పుడు అందరి దృష్టినీ ఆకర్షించే స్థానంలో ఉన్నాడు. ప్రజలు అతని వైపు చూస్తారు. అతని ప్రవర్తనను, జీవన విధానాన్ని, విషయాలను ఏవిధంగా చూస్తున్నాడు అనే విషయాలను గమనిస్తారు. ఒకవేళ వారు అతనిలో ఏదయినా లోపాన్ని గమనిస్తే, అది ప్రజలు ధర్మం నుండి దూరంగా పారిపోయేలా చేస్తుంది. ప్రజలను ప్రోత్సహించటానికి, మీకు మీరు ఒక ఆదర్శవంతులుగా తయారు కావటం ఒక మంచి పద్ధతి. దీని ద్వారా ప్రజలు ప్రేరణను పొందుతారు.

ఇటువంటి శిబిరం ఒకటుందని ప్రజలకు తెలియపరచటం, మన దుఃఖం నుండి బయటకు రావటానికి సహాయపడే సాధన ఒకటుంది అని ప్రజలకు సమాచారం ఇవ్వటమే ప్రధానమైనది. పాశ్చాత్య దేశాలలో వీడియోలు చూపిస్తూ, సమావేశాలు నిర్వహించటం మొదలు పెట్టారు. వాటికి కొద్ది మంది హాజరవుతున్నారు. వారు అడిగే ప్రశ్నలకు సమాధానమివ్వటానికి కొందరు సాధకులు ఉంటారు. ఈ విధంగా ప్రజలు ధర్మం గురించి వినాలి. ఎక్కువ మంది ప్రజలకు ఇటువంటి సాధనా శిబిరాలు నిర్వహింప బడుతున్నాయి అని కూడా తెలియదు. ఈ సమాచారాన్ని ఎంతో వినయంగా తెలియ పరచాలి. ఇది కూడా ఉపయోగపడుతుంది.

**ప్రశ్న : ఎంతో వ్యాప్తి చెందిన మా వ్యాపార కార్యకలాపాలను నేను ఆపి వేయాలి అని అనుకుంటున్నాను. కానీ అది ఎంతో కష్ట సాధ్యమని నేను గమనించాను. అయితే నా సమయం బాగుగా లేదు కాబట్టి, నేను మరి కొంత సమయం వేచి ఉండాలి అని నాకు చెప్పారు. ఈ విషయంలో నక్షత్రాలు, గ్రహాలు నన్ను ప్రభావితం చేస్తాయా?**

**గోయంకా గారు :** (నవ్వుతూ) నక్షత్రాలు చాలా దూరంలో ఉన్నాయి! మరి వాటి నుండి నీవు ఎందుకు భయపడతావు? అవి నీకు ఏవిధంగానూ హాని చేయబోవట్లేదు. నిజానికి మీకు మీరే హాని చేసుకుంటున్నారు. అయితే మీ వ్యాపార బాధ్యతల నుండి మీరు ఎందుకు దూరంగా పారిపోవాలనుకుంటున్నారు? ఇది సరైన విధానం కాదు. ఎంతో మంది సాధకులకు తమ గృహస్థ జీవితం నుండి బయట పడే సమయం ఇంకా ఆసన్నం కాలేదు. ఈ సమయంలో మనకు మంచి, ఆదర్శవంతమైన గృహస్థులు కావాలి. సమాజంలో జీవిస్తూ, బాధ్యతలను నిర్వర్తిస్తూ, మంచి జీవితం జీవిస్తున్న గృహస్థులు అవసరం.

ఈ విధంగా సమాజం అభివృద్ధి చెందటం మొదలు పెట్టాక, వీలయినంత ఎక్కువ మంది విపశ్యన సాధకులు సరైన పద్ధతిలో తమతమ బాధ్యతలను నిర్వహిస్తూ ఉంటే, ఈ మంచి సమాజం నుండి కొంత మంది వ్యక్తులు వచ్చి తమ గృహస్థ జీవితాన్ని వదిలివేస్తారు. తమ స్వీయ ముక్తికి, ముక్తి మార్గంలో ఇతరులకు సహాయం చేయటానికి ఇల్లూ వాకిలి వదిలిపెట్టడం ఆదర్శవంతమైన విషయం. అందుకు మేము వ్యతిరేకం కాదు. అదే సమయంలో మంచి సమాజం కూడా స్థాపింప బడాలి. పెద్ద సంఖ్యలో ఆదర్శ గృహస్థులు తయారవ్వాలి. కాబట్టి ఈ సమయంలో సమస్య నుండి పారిపోవటం, బాధ్యతలనుండి తప్పించుకోవటం పరిష్కారం కాదు, సమాజంలో జీవించండి. అయినప్పటికీ, దానికి బందీలు కావద్దు, దాని పట్ల ఆసక్తి పెంచుకోవద్దు.


రెండు సంవత్సరాలకు చందా రూ **100/-** **విపశ్యన తెలుగు మాసపత్రిక** జీవిత చందా రూ. **500/-**

ప్రచురణ తేది: ప్రతినెల **30/31** పోస్టింగ్ తేది: ప్రతి నెల **1/2** వెల: రూ **5/-**

**విపశ్యన అంతర్జాతీయ ధ్యానకేంద్రం, నాగార్జున సాగర్ రోడ్, వనస్థలిపురం, హైదరాబాదు - 500 070. ఫోన్ : 24240290 (ధ్యానకేంద్రం)**

**ఆఫీసు పని చేయు వేళలు : ఉదయం 9గం॥ల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు**

Postal Reg. HSE 864/2016-2018 RNI Reg. No. APTEL/2006/17745


**PRINTED MATTER**


If Undelivered please return to :

**VIPASSANA INTERNATIONAL MEDITATION CENTRE,**

12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram,

HYDERABAD - 500 070.

Website : www.vri.dhamma.org

E-mail : info@khetta.dhamma.org



Published for Vipassana International Meditation Centre, 12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram, Hyd.(A.P)-70 Ph: 040-24240290, Published by Smt. Sabrina Katakam.
Editor : Sri G.V.Subrahmanyam., Printed at Sai Likhita Printers, #6-2-959, Dakshin Bharat Hindi Prachar Sabha Complex, Khairatabad, Hyd. Ph : 2332579.